

మృత్యు మిద్దెలు



- వర్షాలకు నాని కూలుతున్న మట్టి ఇళ్లు
- చనిపోతున్న పేదలు
- నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో మిద్దె కూలి తల్లీ ముగ్గురు పిల్లలు మృతి
- గతంలో మృతి చెందిన వారికి అందని సాయం
- పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలంటున్న బాధితులు

వర్షాలకు నానిన మట్టి మిద్దెలు మృత్యు పాశాలుగా మారుతున్నాయి. వాటినే నమ్ముకుని నివాసం ఉంటున్న పేదలపై విరుచుకుపడి, తమలో కలిపేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతుండటంతో ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోంది. ఈ ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాథలవుతుండగా, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఒంటరి జీవితం గడుపుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో సోమవారం రాత్రి మట్టిమిద్దె కూలి తల్లీ ముగ్గురు పిల్లలు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. శిథిలావస్థకు చేరిన పాత మట్టి ఇళ్లల్లో ఉంటున్న వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో కూలిన మట్టి మిద్దెల ప్రమాదాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్/గండీడ్/అయిజ/వనపర్తి అర్బన్/పెద్ద కొత్తపల్లి, జూలై 1((ఆంధ్రజ్యోతి): వానకాలంలో పాత మట్టి ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజలు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలా మంది వాటినే తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుని, అందులోనే నివాసం ఉంటున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసిన సమయంలో మట్టి బాగా నాని, మిద్దెలు కూలిపోతున్నాయి. రాత్రివేళ వర్షాలు కురిసిన సమయంలో ఇండ్లు కూలితే ఎక్కువగా ప్రాణ నష్టం సంభవిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో వనపట్లలో చోటుచేసుకున్న ఘటనతో కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత మట్టి ఇళ్లల్లో ఎవరూ నివాసం ఉండొద్దని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దాంతో అధికారులు శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించే పనిలో పడ్డారు. అయితే ఇల్లు ఖాళీ చేసి ఎక్కడుండాలో తెలియక చాలామంది తమ పాత ఇళ్లలోనే ఉంటున్నారు. ఇదే కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు దారితీస్తోంది. అలాంటి వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించి, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



వనపట్లలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో సోమవారం రాత్రి మట్టిమిద్దె కూలి మృతి చెందిన తల్లీ ముగ్గురు పిల్లలు

మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లీ ఇద్దరు కూతుళ్ల దుర్మరణం

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పగిడాల గ్రామంలో 2020 ఆగస్టు 18న భారీ వర్షాలకు మల్లప్ప ఇల్లు కూలిపోయింది. ఈ ప్రమాదంలో నిద్రిస్తున్న మల్లప్ప భార్య శరణమ్మ, కూతుళ్లు భవాని, వైశాలి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మల్లప్ప గాయాలతో బయటపడ్డారు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగినా మల్లప్పకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. భార్యా పిల్లలను కోల్పోయిన అతను ఒంటరిగా దుర్భర జీవితం గడుపుతున్నాడు.



గోపాల్‌పేట మండలం బుద్దారంలో ఇల్లు కూలి మృతి చెందిన ఐదుగురు కుటుంబీకులు(ఫైల్)

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఐదుగురు..

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కొత్తపల్లి గ్రామంలో 2021 అక్టోబరు 10న ముసురు వానలతో నానిన మోస మట్టి మిద్దె కూలిపడింది. ఈ ప్రమాదంలో నిద్రిస్తున్న దంపతులు మోస, శాంతమ్మతో పాటు పిల్లలు రాము, రామ్‌చరణ్, రవితేజ మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక చనిపోయారు. ఐదుగురు సంతానంలో ముగ్గురు చనిపోగా, స్నేహ, చిన్న గాయాలతో బయటపడ్డారు. చిన్నారులు స్నేహ, చిన్న బాబాయ్ రాజు దగ్గర ఉన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు.

వనపర్తి జిల్లాలో ఏడుగురు..

శిథిలావస్థలో ఉన్న మట్టిలు కూలి వనపర్తి జిల్లాలో గతంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. 2020 అక్టోబరు 27న గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో తండ్రి దశదిన కర్మకు వచ్చిన కుటుంబ సభ్యులు శిథిలావస్థలో ఉన్న ఇంట్లో నిద్రిస్తుండగా వర్షంపడి, ఇల్లు కూలింది. దాంతో అక్కడికక్కడే ఐదుగురు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. 2021 జూన్‌లో రేవల్లి మండల పరిధిలోని బండరావిపాకుల గ్రామంలో అప్పటి సర్పంచ్ లక్ష్మమ్మ ఇల్లు కూలిపోయింది. ఈ ప్రమాదంలో మనుమడు యోగేష్, సర్పంచ్ లక్ష్మమ్మ మరణించారు.

వనపట్ల సంఘటనపై మంత్రి జూపల్లి దిగ్ర్భాంతి

వనపట్లలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడం పట్ల రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మట్టి ఇళ్లలో నివసించే వాళ్లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. వనపట్ల సంఘటన నేపథ్యంలో గొడుగుభాస్కర్‌కు మెరుగైన చికిత్స అందించడంతో పాటు బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. శాసన మండలి సభ్యుడు దామోదర్‌రెడ్డి కూడా మృతుల కుటుంబానికి సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన ఘటనలు

నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలో 2022లో మట్టి మిద్దె కూలి భద్రయ్య, వెంకటమ్మ, రాకొండలో కోటమ్మ, తల్లి లింగమ్మలు మృతి చెందారు.

- అదే ఏడాది తాడూరు మండలంలోని యాదిరెడ్డిపల్లి గ్రామంలో ఇల్లు కూలి ఎల్లయ్య చనిపోయాడు.
- గత మే 26న తాడూరు మండలం ఇంద్రకల్‌లో గాలివాన బీభత్సానికి నిర్మాణంలో ఉన్న గోడ నలుగురు మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయలయ్యాయి.

ఆర్థిక స్తోమత లేక కట్టుకోలేకపోతున్నా



ఆర్థిక స్తోమత లేక ఇల్లు నిర్మించుకోలేకపోతున్నా. మాకు వ్యవసాయ భూములు, ఆస్తులు.. ఏం లేవు. కూలీనాలీ చేస్తే తప్ప పూట గడవదు. ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

- కేశన్‌పేట ఎల్లస్వామి, దేవునితిర్మలాపూర్



అమ్రాబాద్ మండలం తెలుగుపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం

సీతక్కా.. సమస్యలు ఇవే

- నేడు నల్లమలలో పర్యటించనున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి
- ఇబ్బందులను తెలిపేందుకు సిద్ధమౌతున్న చెంచులు

మన్ననూర్, జూలై 1: తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క పరిష్కరించాలని చెంచులు కోరుతున్నారు. సోమవారం ఆమె నల్లమలలో పర్యటించనున్న నేపథ్యంలో ఇబ్బందులను తెలిపేందుకు చెంచులు, చెంచు సంఘాల ప్రతినిధులు సిద్ధమౌతున్నారు. నల్లమలలోని మారుమూల పెంటలైన అప్పాపూర్, రాంపూర్, ఫుల్లాయపల్లి, ఈర్లపెంట, మేడిమొల్కల, సంగిడి గుండాల, రాయలేటిపెంట, కొమ్మనపెంట, కొల్లంపెంట, ఆగర్లపెంట తదితర పెంటలకు రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరుతున్నారు. పౌష్టికాహారం అందక చెంచు మహిళలు, చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారని చెంచులు చెబుతున్నారు. ఆర్డీటీ, అపోలో వంటి స్వచ్ఛంద సంస్థలు మినహా ప్రభుత్వ వైద్య సిబ్బంది రెగ్యులర్‌గా పెంటల్లో పర్యటించడం లేదని వాపోతున్నారు. రక్తహీనతతో ఈర్లపెంటకు చెందిన గురువమ్మ, ఆమె ఆడ శిశువు ఇటీవల మరణించారని తెలిపారు. ఐటీడీఏకు గతంలో ఉన్న డిప్యూటీ డీఎంహెచ్‌వోతో పాటు సంచార వైద్యాధికారిని, వైద్య సిబ్బందిని, ప్రత్యేక అంబులెన్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మన్ననూరులో శిథిలమై, మూతపడిన చెంచులక్ష్మి మ్యూజియం, రెస్టారెంట్‌లను పునరుద్ధరించి చెంచులకు ఉపాధి కల్పించాలని ఆశిస్తున్నారు. మన్ననూరు ఐటీడీఏకు ఐఏఎస్ క్యాడర్ కలిగిన రెగ్యులర్ పీవో, పూర్తి స్థాయి కార్యాలయ సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంలో నల్లమల చెంచు పెంటలను సందర్శించి సమస్యలు తెలుసుకున్న సీతక్క.. ప్రస్తుతం వారి ప్రభుత్వం అధికారంలో ఉండటం, ఆమె మంత్రిగా పనిచేస్తుండటంతో తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెంచులు ఆశిస్తున్నారు.



మంత్రి పర్యటన ఇలా..

అచ్చంపేట: నల్లమలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి సీతక్క మంగళవారం అచ్చంపేట నిమోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు హైదారాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 10 గంటలకు మన్ననూర్ అటవీ శాఖ విశ్రాంతి భవనానికి చేరుకుంటారు. తర్వాత తెలుగుపల్లిలోని కేజీబీవీని ప్రారంభిస్తారు. తర్వాత గ్రామ పంచాయితీ భవనానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం వెలమపల్లిలో కమ్యూనిటీ హాల్ భవనానికి, అమ్రాబాద్‌లో డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రాయలగండిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అక్కడి నుంచి బయల్దేరి.. బల్మూర్ మండలం జినుకుంట నుంచి ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి నిర్మించనున్న బీటీ రోడ్డు, లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తారు. అదే విధంగా ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు బీటీ రోడ్డును, ఉప్పరిపల్లిలో సింగిల్‌విండో గోదాంను, గ్రామ పాఠశాలలోని డిజిటల్ గదిని ప్రారంభించనున్నారు. భోజనం అనంతరం అచ్చంపేట పట్టణంలోని ఏసీఆర్ గార్డెన్‌లో మహిళ సంఘాలతో సమావేశం కానున్నారు.

తుంగభద్ర నదిలో దూకి..

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

రాజోలి, జూలై 1 : జోగుళాంబ గద్వాల జిల్లా మండల కేంద్రమైన రాజోలి శివారులో ఉన్న తుంగభద్ర నదిలో దూకి ఓ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలి గ్రామానికి చెందిన బటికిరి శ్రీనివాసులు (60) అనే వ్యక్తి రాజోలి చేనేత సహకార సంఘంలో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూ ఇటీవల రిటైర్డ్ అయ్యారు. ఆయనను ఎప్పటిలాగే సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు తన కుమారుడు బటికిరి బస్వరాజు బైక్‌పై ఎక్కించుకొని వచ్చి సంఘం కార్యాలయం దగ్గర వదిలివెళ్లాడు. మధ్యాహ్నం 2:45 గంటలకు బస్వరాజుకు ఆయన మామ బుగిడే శ్రీనివాసులు ఫోన్ చేసి మీ తండ్రి డ్యాంలో దూకి చనిపోయాడని తెలిపాడు. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఒడ్డుకు తీసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండేవాడని, కుటుంబ సమస్యలతో నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు బస్వరాజు ఫిర్యాదు చేశాడు. ఆమ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాసులుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.

స్వపక్షంలో విపక్షం

- జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ వ్యవహారశైలిపై అన్ని పార్టీల కౌన్సిలర్ల వ్యతిరేకత
- చైర్‌పర్సన్ భర్తపైనా అవినీతి ఆరోపణలు
- ఆమెపై అవిశ్వాసం పెట్టాలంటూ ఇప్పటికే కలెక్టర్‌కు వినతి
- అదే జరిగితే కొత్త చైర్మన్ పదవి కోసం పెరుగనున్న పోటీ



మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు మహబూబ్‌నగర్‌కు విచ్చిన కౌన్సిలర్లు(ఫైల్)

జడ్చర్ల, జూలై 1: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపల్ పాలకవర్గంలో స్వపక్షంలోనే విపక్షం తయారైంది. చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీ వ్యవహారశైలిని ఖండిస్తూ అన్ని పార్టీల కౌన్సిలర్‌లు ఏకమయ్యారు. పాలకవర్గంలోని సభ్యులంతా అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు గడిచిన మూడు సంవత్సరాలుగా వినిపిస్తున్నా- ఇటీవల ఊపందుకున్నాయి. మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త వైఖరితోనే తామంతా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నామంటూ కౌన్సిలర్‌లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, వార్డులలో కౌన్సిలర్‌లు సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపణలు చేశారు. దాదాపు దశాబ్దం తర్వాత మునిసిపాలిటీకి పాలకవర్గం ఏర్పడగా, మొదటి నుంచీ పాలకవర్గం అవినీతి ఆరోపణలను మూటగట్టుకుంది. ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేట్ ప్లాట్లను ఆక్రమించారంటూ విమర్శలొచ్చాయి. ముఖ్యంగా పందుల వ్యవహారం చెందిన ముగ్గురు కౌన్సిలర్‌లు ఇటీవల హస్తం కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన దోరేపల్లి లక్ష్మి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. అదే పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు ఆమెపై అవిశ్వాసం పెట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి గతంలో జోక్యం చేసుకుని, కౌన్సిలర్‌లు ఐక్యంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. కొద్ది కాలం పాటు ఐక్యంగా ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు, నాలుగు రోజుల క్రితం జరిగిన మునిసిపల్ సాధారణ సమావేశాన్ని బహిష్కరించారు. చైర్‌పర్సన్ వ్యవహార్‌శైలితో పాటు చైర్‌పర్సన్ భర్తపై ఆరోపణలు చేశారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు దారితీసింది.

లక్ష్మారెడ్డి జోక్యంతో కొద్దికాలం స్తబ్ధత

మునిసిపాలిటీలో మొత్తం 27 వార్డులకుగాను 23 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులు, చెరో ఇద్దరు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి ఒక కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, బీఆర్‌ఎస్‌కు

అవిశ్వాసం నెగ్గనుందా? వీగనుందా?

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెడితే నెగ్గుతుందా?.. వీగుతుందా? అని బీఆర్‌ఎస్ నాయకులతో పాటు పట్టణంలో చర్చ జరుగుతోంది. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా మారిన దశాబ్దం తర్వాత పాలకవర్గం ఏర్పడింది. అర్థ దశాబ్దం కిందట కొత్తకేశవులు చైర్మన్‌గా పరిపాలన సాగించారు. ఆ తర్వాత చైర్‌పర్సన్‌గా బీసీ మహిళగా దోరేపల్లి లక్ష్మికి అవకాశం వచ్చింది. ఈ అంశంలో బీఆర్‌ఎస్ పార్టీకి మచ్చ రాకుండా.. మహిళా అభ్యర్థికి అగౌరవం కలుగకుండా ఆ పార్టీ నాయకులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనోనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

చైర్‌పర్సన్ పదవిపై నెలకొన్న పోటీ

చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మిపై అవిశ్వాసం నెగ్గితే కొత్త చైర్‌పర్సన్ ఎవరనే అంశంపై పట్టణంలో చర్చ జరుగుతోంది. బీసీ మహిళ రిజర్వేషన్‌గా ఉన్న ఈ చైర్‌పర్సన్ స్థానానికి బీఆర్‌ఎస్ పార్టీలో విపరీతమైన పోటీ నెలకొంది. చైర్‌పర్సన్‌ను ఎవరిని ఎన్నుకుందామనే అంశంలో సభ్యులు ఇప్పటికే గ్రూపులుగా విడిపోయి, రహస్య సమావేశాలను నిర్వహించుకున్నారు. చైర్‌పర్సన్‌గా తన భార్యకు అవకాశం ఇవ్వాలంటూ ఓ సీనియర్ నాయకుడు ఇప్పటికే పార్టీ అధిష్ఠానంతో పాటు కౌన్సిలర్‌ల ముందు ప్రస్తావించినట్లు తెలిసింది. తన భార్యకు అవకాశం ఇస్తే ఒక్కో కౌన్సిలర్‌కు రూ.మూడు లక్షలు ఇస్తానంటూ మరో బీఆర్‌ఎస్ నాయకుడు కౌన్సిలర్‌లకు గాలం వేస్తున్నాడన్న ఆరోపణలు వస్తున్నాయి. తాము సైతం చైర్‌పర్సన్‌కు అర్హులమేనంటూ మరికొందరు కౌన్సిలర్‌లు ముందుకువచ్చారు.

నలుగురు ఉపాధ్యాయులపై.. శాఖాపరమైన చర్యలు



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈవో (ఫైల్)

- స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం
- జడ్చర్ల ఎంఈవో ఇచ్చిన నివేదిక మేరకు చర్యలకు సిద్ధమైన డీఈవో
- స్కూల్ అసిస్టెంట్స్ బదిలీల్లో 20 మంది టీచర్స్‌ను స్పౌజ్ జాబితా నుంచి తొలగింపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 1: స్పౌజ్ పాయింట్ల కోసం తప్పుడు సమాచారాన్ని ఇచ్చిన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని నలుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోనున్నారు. ఎంఈవో ఇచ్చిన నివేదిక మేరకు వారిపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమౌతున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ బదిలీల్లో పలువురు ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారని తెలుస్తోంది. ఆ అవకతవకలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వచ్చాయి. స్పందించిన విద్యాశాఖ అధికారులు స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ విషయమై ఆర్‌జేడీ విజయలక్ష్మి ఇప్పటికే 15 మంది జీహెచ్‌ఎంలకు రెండు సార్లు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. దీనిపై విచారణ జరుగుతుండగా, స్కూల్ అసిస్టెంట్స్ బదిలీల్లో 20 మంది టీచర్స్‌ను స్పౌజ్ జాబితా నుంచి తప్పించారు. తాజాగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ బదిలీల్లో మరికొంత మంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్ల వినియోగంలో తప్పుడు సమాచారం ఇచ్చారని గుర్తించారు. నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ మండలాల్లో పని చేసే కొందరు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ పాయింట్లు పెట్టుకొని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు. వారి విషయం తేలాల్సి ఉండగా, జడ్చర్ల మండల పరిధిలో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసిన నలుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో చెప్పారు.

పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై1: జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఔత్సాహికులను ప్రోత్సహించి సత్వరమే అనుమతులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో టీజీ ఐపాస్ సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావే శంలో కలెక్టర్ మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరిచి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునే ఔత్సాహికులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్, టౌన్ ప్లానింగ్, పరిశ్రమల శాఖల నుంచి ఇవ్వాల్సిన అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేయొద్దని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్, జిల్లా పరిశ్రమల అభివృద్ధి అధికారి యాదగిరి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్ శాఖ , టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

లే అవుట్‌ల ప్లాట్ల అనుమతికి ప్రభుత్వ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లే అవుట్ పరిశీలన కమిటీ సమావేశమై చర్చించింది. నాలుగు లే అవుట్‌ల దరఖాస్తులు పరిశీలనకు రాగా సరైన దస్ర్తాలు లేని కారణంగా తదుపరి సమావేశంలో చర్చిం చనున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

రైలు కిందపడి తండ్రీ కూతురు దుర్మరణం

- కుటుంబ కలహాలతో తండ్రి ఆత్మహత్య
- తండ్రిని కాపాడే క్రమంలో కూతురూ మృతి





శివానంద్, చందన(ఫైల్)

మహబూబ్‌నగర్, జూలై 1 : రైలుకిందపడి తండ్రీకూతురు మృతి చెందారు. కుటుంబ కలహాలతో క్షణికావేశానికి లోనైన తండ్రి సమీపంలోనే ఉన్న రైలుపట్టాలపైకి వెళ్లగా అతన్ని కాపాడేందుకు వెంటనే వెళ్ళిన కూతురు రైలు కిందపడుతున్న తండ్రిని కాపాడే క్రమంలో ఆమె కూడా రైలు కిందపడి మృతి చెందిన విషాదఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపల్లికి చెందిన శివానంద్(46) కొన్నేళ్ళ క్రితం మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. ఇక్కడే ఎస్‌వీఎస్ ఆసుపత్రిలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య, కూతురు, కొడుకుతో కలిసి ఏనుగొండలో నివాసం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో కుటుంబంలో జరిగిన చిన్న గొడవతో క్షణికావేశానికి లోనైన శివానంద్ చనిపోతానని ఇంటికి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలవైపు వెళ్ళగా కూతురు చందన(17) తండ్రిని అనుసరిస్తూ వెళ్ళింది. పట్టాలపైకి వెళ్ళిన తండ్రిని కూతురు వారిస్తున్నా వినలేదు. ఇంతలో అమరావతి రైలు రావడంతో తండ్రిని కాపాడేందుకు కూతురు కూడా పట్టాలపైకి వెళ్ళింది. ఈ క్రమంలో ఇద్దరూ రైలు కిందపడి మృతి చెందారు. చందన ఎస్‌వీఎస్ ఆసుపత్రిలో డీఎంఎల్‌టీగా పనిచేస్తుండగా, కొడుకు ఇంటర్ చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న భార్య సొమ్మసిల్లి పడిపోవడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను రైల్వే పోలీసులు జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
కల్వకుర్తి : 9985403252
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365





పోలీస్ కొత్త చట్టాలతో

కేసుల్లో పురోగతి

- తీవ్ర జాప్యం అరికట్టడంతో పాటు నిందితులకు త్వరగా శిక్ష
- జీరో ఎఫ్ఐఆర్‌లు బలోపేతం
- ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేస్తే మూడ్రోజుల్లో సంతకాలు తీసుకొని విచారణ
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పోలీసులకు వీటిపై శిక్షణ



కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్, జూలై 1 : పోలీస్‌శాఖలో బ్రిటీష్‌కాలం నాటి చట్టాలే అమలులో ఉండటంతో కేంద్రం మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలలో మార్పులు తీసుకుచ్చేందుకు శ్రీకారం చుడుతూ కొత్త చట్టాలను అమలు చేస్తోంది. కేసుల్లో తీవ్ర జాప్యాన్ని నియంత్రించడంతో పాటు చట్టాలను కఠినతరం చేయడం, నిందితులకు శిక్షపడటంతో పాటు పోలీసులకు ప్రస్తుతం ఉన్న అధికారాలకు మరిన్ని అధికారాలను కల్పిస్తూ చట్టాలను రూపొందించారు. ఆదే పోలీస్‌శాఖలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకునేందుకు పోలీసులకు కొంత సమయం పట్టనుంది. చాలామంది అధికారులు ఆ చట్టాలను అధ్యయనం చేస్తున్నారు. జూలై 1నుంచే కొత్తచట్టాలు అమల్లోకి రాగా ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన కొందరు ఉన్నతాధికారులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వగా శిక్షణ పొందిన అధికారులు జిల్లాలోని పోలీస్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ చట్టాలపై డీజీపీ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎస్పీలకు ఇప్పటికే బుక్‌లెట్ జారీ చేశారు. కొత్త చట్టాలలో పోలీసుల అధికారాలు కూడా పెరగనున్నాయి. ఇదివరకు లాఠీచార్జి చేయాలంటే మెజిస్ట్రేట్ పవర్ కావాల్సి ఉండేదని, ఇప్పుడు ఈ చట్టాల ప్రకారం ఎస్పీలకు ఆ పవర్స్ ఇవ్వనున్నారు.

పోలీస్‌స్టేషన్‌లకు రాకుండానే ఫిర్యాదుచేసే వెసులుబాటు

ఇదివరకు పోలీస్‌స్టేషన్‌లకు వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే కేసులు పెట్టేవాళ్లు. అయితే చాలామంది స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడటం, లేదంటే తమకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం రాదనుకునేవాళ్లు చాలావరకు ఫిర్యాదుల వరకు వెళ్లేవారు కాదు. ఇప్పుడు స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు ఇవ్వవచ్చు. ఉదాహరణకు వాట్సాప్‌లో పోలీస్ అధికారికి ఫిర్యాదు చేస్తే ఆయన మూడ్రోజుల్లో ఫిర్యాదుదారుడితో సంతకంతో కూడిన కాపీని తీసుకుని దర్యాప్తు ప్రారంభిస్తారు. అదేవిధంగా ఇదివరకు జీరో ఎఫ్ఐఆర్ అంటే నామమాత్రంగా కట్టి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు రిఫర్ చేసేవాళ్లు. కొత్త చట్టంలో జీరో ఎఫ్ఐఆర్ పటిష్టంగా ఉండనుంది. కొత్త చట్టాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. సీఆర్‌పీసీలో ఓ నేరానికి సంబంధించిన సెక్షన్ కొట్టగానే కొత్తచట్టంలో మారిన ఆ చట్టానికి సంబంధించిన వివరాలు రానున్నాయి.

చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం



పోలీస్ కొత్తచట్టాలు బాగున్నాయి. ఇదివరకున్న పాత పద్ధతులు కాకుండా కొంత వేగంగా కేసులు పరిష్కరించేలా చట్టాలను తీసుకువచ్చారు. పోలీసులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా చట్టాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉంది. చట్టంలో చాలామార్పులు తీసుకువస్తున్నారు. ఏడేళ్లకన్నా ఎక్కువ శిక్షపడే కేసుల్లో వీడియో, ఆడియో రికార్డులు చేసి కోర్టులకు సమర్పించాల్సి ఉంటుంది. ఇదివరకు జీరో ఎఫ్ఐఆర్‌లకు నెంబర్ ఇచ్చేవాళ్లు కాదు. ఇప్పుడు జీరో ఎఫ్ఐఆర్‌లకు నెంబర్ ఇవ్వనున్నారు.

\- ఎస్పీ జానకిధరావత్

కొత్తచట్టాలతో కేసులు త్వరగా పరిష్కారం



పోలీస్ కొత్తచట్టాలతో కేసుల విచారణలో జాప్యాన్ని నివారించవచ్చు. నిందితులు వాయిదాలకు పదేపదే రాకుండా కేసు పెండింగ్ పెట్టకుండా విచారణ కొనసాగిస్తారు. కొన్ని కేసుల్లో పనిష్మెంట్ పెరగనుంది. సాక్షాలను పకడ్బందీగా సేకరించి కోర్టులకు సమర్పించాల్సి ఉంటుంది.

\- డీఎస్పీ వెంకటేశ్వర్లు

విద్యార్థులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- బీఆర్‌ఎస్‌వీ పీయూ చైర్మన్ భరత్

పాలమూరు యూనివర్సిటీ, జూలై 1 : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెం టనే నెరవేర్చాలని బీఆర్‌ఎస్‌వీ పీయూ విద్యార్థి చైర్మన్ భరత్ డిమాండ్ చేశారు. సోమవారం పీయూ ప్రధాన గేటు ఎదురుగా బీఆర్‌ఎస్‌వీ ఆధ్వ ర్యంలో పీయూ విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్‌వీ పీయూ చైర్మన్ భరత్ మాట్లాడుతూ గ్రూప్-1 పోస్టులతో పాటు, గ్రూప్-2 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో 30వేల పోస్టులను భర్తీ చేయాలని, గ్రూప్-1 పోస్టుల కోసం ప్రిలిమ్స్‌లో 1:100 నిష్పతిలో మెయిన్స్‌కి ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను వేస్తానని చెప్పి మాట తప్పిందని, నిరుద్యోగులకు న్యాయం చేయకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీయూ బీఆర్‌ఎస్‌వీ విద్యార్థినీ, విద్యార్థులు రమేష్, ఆంజనేయులు, రాఘవేందర్, నవీన్‌గౌడ్, సాయికుమార్, ప్రవీన్, శ్రీకాంత్, మౌనిక, మమత తదితరులున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీయూ ప్రధాన గేటు ఎదుట నిరసన తెలుపుతున్న పీయూ విద్యార్థులు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

మహిళా రైతు ఆత్మహత్యాయత్నం



లింగాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న మహిళా రైతు

లింగాల, జూలై 1 : తన భూమిని అధికారులు ఇతరుల పేరిట పట్టా చేశారని ఆందోళన వ్యక్తం చేస్తూ మహిళా రైతు గాలేటి జయమ్మ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిల్‌తో ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా లింగాలలో సోమవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తమ గ్రామం లింగాల శివారులోని సర్వే నంబర్ 770లో 1-37 ఎకరాల భూమి తనకు వారసత్వంగా చెందాల్సి ఉండగా అధికారులు ఇతరుల పేరిట పట్టా చేశారని ఆమె వాపోయింది. పట్టా మార్పిడి చేయాలని ఎళ్ల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించింది. దీంతో సోమవారం ఉదయం పెట్రోల్ బాటిల్‌తో కార్యాలయం దగ్గరకు చేరుకున్న ఆమెను పలువురు వారించేందుకు ప్రయత్నం చేశారు. చివరకు కొంతమంది అతి కష్టం మీద ఆమె చేతిలో ఉన్న పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. కార్యాలయం లోపల ఉన్న డిప్యూటీ తహసీల్దార్ పట్టాభి బయటకు వచ్చి మహిళా రైతు సమస్యను తెలుసుకొని ఆమె దగ్గర ఉన్న పత్రాలను పరిశీలించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో మహిళా రైతు ఆందోళన విరమించారు.

మా భూమిని కబ్జా చేశారని

రైతు ఆత్మహత్యాయత్నం

- పలువురు కలెక్టర్‌లకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని ఆవేదన
- కబ్జా చేసిన వారే చంపుతామని బెదిరింపులు



రైతు పరుశరాంను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం, జూలై 1 : తమ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేశారని, పలువురు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని అదనపు కలెక్టర్ ఎదురుగానే రైతు వడ్డెపరుశరాం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అయిజ మండలం యాపలదిన్నె శివారులోని గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె సవారన్నకు ముగ్గురు కుమారులు వడ్డెపరుశరాం, వడ్డె తిమ్మప్ప, వడ్డె కృష్ణ ఉన్నారు. వీరికి సర్వే. నెం. 321లో వడ్డె సవారన్న పేరుతో 1986లో ఐదు ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం ఇచ్చింది. తర్వాత సవారన్న, ఆయన భార్య చనిపోవడంతో ముగ్గురు అన్నదమ్ములు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. కొంతకాలం నుంచి తమ భూమికి పక్కనే ఉన్న భూ యజమానులు అయిన లోకేశ్వర్‌రెడ్డి, చాకలి గోవిందమ్మ, సి. సత్యారెడ్డి, చాకలి శంకరన్న, కె.ఎల్లారెడ్డి అక్రమించుకొని, ఆ భూమిలోకి వస్తే వారిని చంపుతామని బెదిరిస్తున్నారు. దీనిపై పోలీసులు, మారుతూ వచ్చిన ఐదుగురు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా అక్రమించినవారికి పలుకుబడి ఉండటంతో తమ ఫిర్యాదులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ విషయంపై ఆరు వారాల్లో భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయగా, సర్వే అధికారులు తాము పొలంపై మోకాలో లేమని నివేదిక ఇచ్చారన్నారు. ఇప్పుడు ధరణి పోర్టల్‌లో కూడా భూమిని కబ్జా చేసిన వారి పేర్లు ఉన్నాయన్నారు. ఈ విషయంలో ప్రశ్నిస్తుంటే తమను చంపుతామని బెదిరిస్తున్నారని, దీంతో కుటుంబ సభ్యులతో సహా అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు ఎదురుగా బాధితులు వడ్డె పరుశరాం డబ్బాలో తెచ్చుకున్న పురుగుల మందును తాగాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి ప్రమాదం లేదని వైద్యులు చెప్పారు.

ఆక్యుపంక్చర్ థెరపీ కేంద్రం తనిఖీ

గద్వాల న్యూటౌన్, జూలై 1 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భీంనగర్‌లో కర్నూల్‌కు చెందిన షేక్‌బాషా నిర్వహిస్తున్న ఆక్యుపంక్చర్ థెరపీ కేంద్రాన్ని సోమవారం వైద్యసిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌చార్జి డీఈఎంవో (జిల్లా విస్తరణ, మీడియా అధికారి) మధుసూదన్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య రికార్డులను పరిశీలించి, కేంద్రం నిర్వహణకు అనుమతులు లేవని నిర్ధారించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010, రూల్స్-2011 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకుడు షేక్ బాషాను ఆదేశించారు. క్లినిక్ నిర్వహణకు అనుమతించొద్దని భవనం యజమానికి సూచించారు.





ఐదేళ్లలో జడ్పీ పాలన అంతంతే..

- నాలుగవ తేదీన ముగియనున్న పదవీ కాలం
- వచ్చిన నిధులు రూ. 9.84కోట్లు
- ఖర్చు చేసింది రూ. 5.56 కోట్లు
- 19 సమావేశాల్లో ఒకసారి కోరమ్ లేక వాయిదా

గద్వాల, జూలై 1 : జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే జడ్పీ పాలన ఐదేళ్లలో అంతంత మాత్రంగానే సాగింది. తెలంగాణ ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు వచ్చే నిధులలో కోతలు పెట్టడంతో కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సంఘం నిధుల మీదే ఆధార పడాల్సి వచ్చింది. దీంతో చేయాల్సినంత అభివృద్ధి చేయకుండానే నాలుగవ తేదీన పాలక వర్గం కాలపరిమితి ముగియనున్నది. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన సరిత 2019, జూలై ఐదవ తేదీన జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. మొదటి సమావేశం నుంచే అధికార పార్టీ ఎమ్మెల్యే అయిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో విభేదాలు తలెత్తాయి. ఒకే అధికారపార్టీలో ఉన్న వీరిద్దరూ ఎడమొహం పెడమొహంలా ఉంటూ వచ్చారు. దీంతో అర్థవంతంగా జరగాల్సిన సమావేశాలు నామమాత్రంగానే సాగాయి. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీ రాములు రెండు సమావేశాలకు మాత్రమే హాజరయ్యారు. అలంపూర్ ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ అబ్రహం ఆరు సమావేశాలకు హాజరయ్యారు. దానికి తోడు అందరూ అధికార పార్టీ జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు (ఒకరు మినహా)ఉండటంతో ఏమి అడిగితే ఏ సమస్య వస్తుందోనని నిమ్మకుండిపోయేవారు.

ఒకరిద్దరు మాత్రమే అధికారులను నిలదీస్తే, చేస్తాం, చూస్తాం అనే సమాధానాలు వచ్చేవి. విపక్షం లేకపోవడంతో సమస్యలపై నిలదీసే వాళ్లు లేక ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయి. రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, గ్రామాల అభివృద్ధితో పాటు సాగునీటి సమస్యలు ఎక్కడికక్కడే మిగిలిపోయాయన్న ఆరోపణలు వ్యక్తం అయ్యాయి.

జడ్పీకి వచ్చిన నిధులు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి కొత్తగా ఏర్పడిన గద్వాల జిల్లా పరిషత్‌కు ఐదేళ్లలో రూ.9.84 కోట్ల నిధులు వచ్చాయి. అందులో 15వ ఆర్థిక సంఘం నిధులు, స్పెషల్ గ్రాంట్స్ కలిపి రూ. 4.91 కోట్లు, ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్స్ రూ.1.42 కోట్లు వచ్చాయి. 15వ ఆర్థిక సంఘం హెల్త్ గ్రాంట్స్ రూ.3.51 కోట్లు వచ్చాయి. ఇవి కాకుండా సీనరైజెస్ గ్రాంట్స్ 1.22 కోట్లు రాగా, అందులో మండల పరిషత్‌లకు రూ. 62 లక్షలు, గ్రామ పంచాయతీలకు రూ.30 లక్షలు పంపిణీ చేశారు. మిగిలిన రూ. 30 లక్షల నిధులతో ఐదేళ్ల పాటు పాలన కొనసాగింది. స్థానిక సంస్థలకు వచ్చే స్టాండ్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీల వంటి జనరల్ ఫండ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో జమ చేసుకుంటుండటంతో జనరల్ ఫండ్స్ ఎక్కువగా రావడం లేదు.


గద్వాల జిల్లా పరిషత్ కార్యాలయం

ఐదేళ్లలో చేపట్టిన పనులు..

జడ్పీలోని 15వ ఆర్థిక నిధులు, గ్రాంట్స్ హెల్త్ గ్రాంట్స్‌ను ఆయా మండలాల జడ్పీటీసీల ద్వారా ఖర్చు చేశారు. ఇందులో పాఠశాలల తరగతి గదులు, ప్రహరీలు, మరమత్తులు, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, మురుగు కాలువల నిర్మాణం, శ్మశానవాటికల వద్ద ఏర్పాట్లతో పాటు, హెల్త్ గ్రాంట్స్ నుంచి ఉప్పేరు, రాజోలి, మల్దక్, వడ్డేపల్లి, ఇటిక్యాల, క్యాతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఉండవెల్లి, కేటీదొడ్డి తదితర కొత్త మండలాల్లో రూ.1.50 కోట్లతో పీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మించారు. ఇలా జిల్లా మొత్తంగా 201 అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.5.56 కోట్లతో 156 పనులను పూర్తి చేశారు. మరో 54 పనులు కొనసాగుతున్నాయి. వాటికి ఇంకా రూ. 4.28 కోట్లు చెల్లించాల్సి ఉంది.

చైర్‌పర్సన్‌గా సంపూర్ణ పాలన



జడ్పీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల : ఐదేళ్ల పాలనలో ఎక్కడ ఇబ్బందులు రాకుండా సంపూర్ణ పాలన చేశా. ఆర్థిక సంఘం నిధులలో కోత, స్టేట్ నిధులు మూడేళ్లు రాలేదు. నిధులలో కోత ఉండటంతో మండలాలకు కేటాయింపులు తక్కువయ్యాయి. వచ్చిన నిధులను సద్వినియోగం చేశాం. విద్య, ఆరోగ్యం, రోడ్లు, మురికికాలువలకు ఎక్కువగా నిధులు కేటాయించాం. పాఠశాలలకు మరమ్మతులు చేయించాం. అన్ని సమావేశాల్లో సభ్యులు పూర్తి సహాయ సహకారాలు అందించారు. జిల్లా ప్రజల నుంచి పూర్తి సహాయ సహకారాలు అందడంతో చాలా సంతోషంగా ఉన్నాను.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో టిప్పర్ బోల్తా: ఒకరికి తీవ్ర గాయాలు


దోమలపెంట సమీపంలో బోల్తాపడ టిప్పర్

దోమలపెంట, జూలై 1: నల్లమల ప్రాంతం శ్రీశైలం ఘాట్ రోడ్డులో కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ అదుపు తప్పి లోయలోకి పడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. అమ్రాబాద్ మండలం దోమలపెంటలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్ననూర్ నుంచి శ్రీశైలానికి కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ గోవిందరాజులనగర్ కాలనీ సమీపంలో మలుపు వద్ద టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ ఖదీర్(38) తల, మొఖానికి, తీవ్రగాయాలు కాగా 14 కుట్లు పడ్డాయి. మరో డ్రైవర్ హరీష్ (35) స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఖదీర్‌ను నందాల జిల్లా సునిపెంట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హరీష్‌కు ఈగలపెంట జెన్‌కో ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ ప్రమాద ఘటనపై అమ్రాబాద్ సీఐ శంకర్‌ను వివరణ కోరాగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని దీనిపైన పూర్తి సమాచారం అందితే పరిశీలిస్తామని ఆయన తెలిపారు.

● సైడ్‌వాల్ నిర్మించాలి: ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్

ఈ ప్రాంతంలో ఇప్పటికే ఆరు వాహనాలు బోల్తాపడి చాలా మంది చనిపోయారు. ఇక్కడ సైడ్‌వాల్ నిర్మాణం చేపట్టాలి. ఎన్‌హెచ్‌ఏ 765 అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

తెలకపల్లిలో మరొకరికి..

తెలకపల్లి, జూలై 1 : ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో సైకిల్‌పై వెళ్తున్న సురేష్ అనే వ్యక్తిని అటు నుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో గాయాలయ్యాయి. ఆటో నడుపుతున్న వ్యక్తి రాకొండకు చెందిన శివపై స్థానిక వ్యక్తి రాజమహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

కుక్కల దాడిలో రెండు లేగ దూడలు మృతి

ఊర్కొండ, జూలై 1: కుక్కల దాడిలో రెండు లేగ దూడలు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని రాంరెడ్డి పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు అనిల్ తెలిపిన వివరాల ప్రకారం... రోజువారిగా ఆదివారం రాత్రి పశువులను పశువుల పాకలో ఉంచి ఇంటికి రావడం జరిగింది. సోమవారం తెల్లవారుజామున పాలు తీయడానికి వెళ్లగా రెండు లేగ దూడలు కుక్కల దాడిలో మృతి చెందాయని తెలిపారు. నెల రోజుల క్రితమే రెండు లక్షల రూపాయలు పెట్టి రెండు లేగ దూడలు తీసుకువచ్చాం. పాలు విక్రయించి జీవనోపాధి పొందుతున్న నాకు ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్‌షాక్‌తో..

తాడూరు: మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బీరయ్య అనే రైతు కాడెద్దు మృతి చెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై ఎద్దు మృతి చెందినట్లు రైతులు వాపోతున్నారు. సుమారుగా 60వేల విలువైన ఎద్దు మృతి చెందడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం చనిపోయిన ఎద్దుకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు బీరయ్య కోరారు.

రేపు డీఎంఈ కార్యాలయం ముట్టడి

ధర్నా నోటీసును సూపరింటెండెంట్‌కు అందజేసిన కార్మికులు


నోటీసును అందజేస్తున్న ఆసుపత్రి కార్మికులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 1 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3న డీఎంఈ కార్యాలయం ముట్టడి చేపట్టనున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఈమేరకు ముట్టడికి సంబంధించి నోటీసును సోమవారం ప్రభుత్వ వైద్యకళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్‌కు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న డీఎంఈ కార్యాలయ ముట్టడికి రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల నుంచి కార్మికులు వేల సంఖ్యలో తరలివస్తున్నారని కార్యక్రమానికి వెళ్లేందుకు గాను తమకు అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా సోమవారం డాక్టర్స్ డేని పురస్కరించుకొని వైద్యులకు శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు నర్సింహ, మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భీమయ్య, అంజమ్మ, పద్మ, వరలక్ష్మి తదితరులున్నారు.

నిర్మాణాన్ని కూల్చివేసిన టాస్క్‌ఫోర్స్ టీం

జడ్చర్ల, జూలై 1 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని గంగాపురం రోడ్డులోని సర్వే నెంబరు 147లోని ఓ ప్లాటులో నిర్మాణాన్ని సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో కూల్చివేశారు. జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ ద్వారా వచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ బృందం చర్యలు తీసుకున్నారు. సర్వే నెంబరు 147లో ఓ ప్లాటులో ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు రద్దు అయ్యాయని, అందుకు భిన్నంగా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందానికి జడ్చర్ల కమిషనర్ రాజయ్య ఇచ్చిన ఉత్తర్వుల మేరకు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని గుర్తించిన టాస్క్‌ఫోర్స్ బృందం కూల్చివేసింది. కాగా, సర్వే నెంబరు 147లోని 250 గజాల ప్లాటుపై కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ నిర్మాణాలను కూల్చివేశారంటూ ప్లాటు యజమానులు ఆరోపిస్తున్నారు.

పిల్లలు సహా వివాహిత అదృశ్యం

ఉండవల్లి, జూలై 1 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం చిన్న దగడ గ్రామానికి చెందిన వివాహిత, ఇద్దరు పిల్లలు సహా అదృశ్యమైనట్లు ఉండవల్లి ఎస్ఐ శ్రీనివాసులు నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కంచుపాడు గ్రామానికి చెందిన గోవిందమ్మకు, వనపర్తి జిల్లాకు చెందిన మద్దిలేటితో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. గత నెల 10న కుటుంబ సభ్యులతో గొడవ పడిన గోవిందమ్మ తన పుట్టినిల్లు కంచుపాడుకు పిల్లలు పూజిత(14), శివశంకర్(7)లతో కలసి వచ్చింది. పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చిన సోదరుడు బాలు అదే నెల 13న గోవిందమ్మను అత్తగారింటికి పంపించారు. ఈ నేపథ్యంలో భర్త మద్దిలేటి సోమవారం కంచుపాడుకు వచ్చి, భార్యా పిల్లలను పంపించాలని కోరాడు. తాము గత నెల 13నే అత్తగారింటికి పంపించామని సోదరుడు బాలు ఆయనకు తెలిపారు. అక్కడికి రాలేదని చెప్పడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో విచారించారు. ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కల్వకుర్తిటౌన్, జూలై 1 : తప్పిపోయిన బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ఓ కుంటుంబం ఇటీవల కళ్యాణ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారికి చెందిన బాలుడు సాయంత్రం హైదరాబాద్ చౌరస్తాలో తప్పిపోయాడని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలుడిని పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. అజయ్ ఫొటో కొద్ది గంటల్లోనే నెట్టింట వైరల్‌కాగా వెంటనే స్పందించిన తల్లిదండ్రులు, ఇతర బంధువులు పోలిస్‌స్టేషన్‌కు వచ్చి బాలుడి తాలూకు విషయాలు తెలపడంతో వారికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

కల్యాణం కమనీయం

- కల్యాణానికి హాజరైన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దంపతులు

బిజినేపల్లి, జూలై 1 : మండల కేంద్రంలోని ఆనందగిరి గుట్టపై వెలసిన గోదా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం సోమవారం అశేష భక్తజన గోవింద నామస్మరణలతో కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గ్రామ మహిళలు పూలతో అందంగా అలంకరించి, వట్టెం ఆలయ కమిటీ సభ్యులు సమర్పించిన పట్టు వస్త్రాలతో నూతన వధూవరులుగా ముస్తాబు చేశారు. ముత్తైదలు తలంబ్రాలను చేసి మేళతాళాలతో ఊరేగింపుగా భక్తుల ఆట పాటలతో ఆలయానికి తీసుకొచ్చి మండపంలో ఉంచారు. ఆలయంలోని గోదాదేవి, లక్ష్మీదేవి, వెంకన్న స్వామి ఉత్సవ మూర్తులను సన్నాయి వాయిద్యాలతో కల్యాణ మండపంలోకి తీసుకొచ్చి వేద మంత్రోచ్ఛారణలతో కల్యాణోత్సవ ఘట్టాలను పురోహితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలను అలంకరించిన ఉత్సవ మూర్తులకు జిలకర్ర బెల్లం పెట్టి, మంగళసూత్ర ధారణ కనుల పండువగా జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవానికి నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎస్పీ కుటుంబ సభ్యులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి కల్యాణోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఆనందగిరి గుట్ట ఆధ్యాత్మిక శోభతో పరిఢవిల్లింది.


బిజినేపల్లిలోని ఆనందగిరి వెంకన్న స్వామి కల్యాణోత్సవానికి హాజరైన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దంపతులు


ఆనందగిరి వెంకన్న స్వామికి తలంబ్రాలు పోస్తున్న పురోహితులు

విజయ్‌కుమార్ గోదాములోని వేబ్రిడ్జిపై కేసు నమోదు

● తూకంలో వ్యత్యాసంపై ఫిర్యాదు మేరకు తనిఖీ చేసిన లీగల్ మెట్రాలజీ అధికారులు

జడ్చర్ల, జూలై 1 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చెర్లపల్లి గ్రామానికి వెళ్లే దారిలోని విజయ్‌కుమార్ గోదాములోని వే బ్రిడ్జిపై యాదాద్రి భువనగిరి లీగల్ మెట్రాలజీ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ కేసు నమోదు చేశారు. వే బ్రిడ్జిలో తూకంలో వ్యత్యాసం వస్తోందని వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం వే బ్రిడ్జిని తనిఖీ చేశారు. వే బ్రిడ్జిలో ఒక వెయ్యి కిలోలకు 10కిలోల చొప్పున, 5వేల కిలోలకు 40కిలోల చొప్పున వ్యత్యాసం వస్తున్నట్లుగా గుర్తించారు. లీగల్ మెట్రాలజీ చట్టాన్ని ఉల్లంఘించినందుకు వే బ్రిడ్జిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వే బ్రిడ్జిని ప్రతీరోజు తప్పనిసరిగా ప్రామాణికమైన బాట్లను(ఐదు టన్నుల నుంచి పది టన్నుల వరకు) చెక్ చేసుకుని, కరెక్ట్‌గా ఉందని నిర్ధారించుకున్న తర్వాతనే వే బ్రిడ్జిని వాడాలని సూచించారు. వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను వే బ్రిడ్జి నిర్వాహకులు తీసుకోవాలన్నారు. వే బ్రిడ్జి ఉన్న స్థలంలో టన్నుకు తక్కువ కాకుండా బాట్లను అందుబాటులో ఉంచాలని వెల్లడించారు. వినియోగదారులు కోరినట్లయితే వే బ్రిడ్జిపై బాట్లను పెట్టి తూకం సరిగ్గా ఉందనే విషయాన్ని చూపించాల్సి ఉంటుందని తెలిపారు. తూకంలో తేడా లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుని వ్యాపారం చేసుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ బాలప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులున్నారు.


చెర్లపల్లిరోడ్డులోని వేబ్రిడ్జిని తనిఖీ చేస్తున్న యాదాద్రిభువనగిరి జిల్లా లీగల్ మెట్రాలజీ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ, డీటీ బాలప్రసాద్

సింగరేణి ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ
● బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే ఆపాలి

అమరచింత, జూలై 1: సింగరేణి బొగ్గు గనులను మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడానికి కుట్ర పన్నుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ విమర్శించారు. అమరచింత మండల కేంద్రంలోని మత్స్య భవనంలో సోమవారం జరిగిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి పదవి తీసుకున్న వెంటనే కిషన్ రెడ్డి బొగ్గు గనులను వేలంపాట వేయాలని ప్రకటించడం సింగరేణి ప్రైవేటీకరణ చేస్తారనడానికి నిదర్శనమన్నారు. నీట్ పేపర్ లీక్ అవ్వడంతో పేదలు డాక్టర్ కావాలన్న కల నెరవేర్చకుండా బీజేపీ కుట్ర చేస్తున్నదని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో నీట్‌పై మాట్లాడకపోవడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెంచిన పెన్షన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోల్డ్ లోన్ తీసుకున్న వారికి కూడా రుణమాఫీ అమలు చేయాలని ఆయన అన్నారు. కొత్త రేషన్ కార్డులు పెన్షన్లకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు వెంకటేష్, ఆర్ఎన్ రమేష్, అజయ్, రాజు, మండల నాయకులు ఎస్ఈ శ్యాం సుందర్, బుచ్చన్న, అనంతమ్మ, బెక్కెం విష్ణు, వెంకటేష్, రవి, రాఘవ, చంటి పాల్గొన్నారు.



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

చెంచు మహిళకు సహాయం


బాధిత చెంచు మహిళ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి.సముజ్వాల

కొల్లాపూర్, జూలై 1 : కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లి గ్రామంలో బాధిత చెంచు మహిళను సోమవారం ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ వి.సముజ్వాల, అసిస్టెంట్ డైరెక్టర్లు పద్మ, లీలలు డిప్యూటీ డైరెక్టర్ ఎండి.మసూద్‌ఖాన్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ, ట్రైబల్ రిసెర్చ్ ఇన్‌స్ట్రక్షన్ ఆదేశాల మేరకు బాధిత మహిళను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై అధికారులు ఆరా తీశారు. ఐటీడీఏ నుంచి బాధిత మహిళకు 25వేలు, మంత్రి సీతక్క ద్వారా బాధిత మహిళకు 25వేలతోపాటు ఆదివారం మంత్రి జూపల్లికృష్ణారావు లక్ష రూపాయల చెక్కును బాధిత మహిళకు అందజేసినట్లు ట్రైబల్ అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఆదిలాబాద్ నుంచి వచ్చిన వైద్యులు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీడీపీవో వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, డీజీడీవో కమలాకర్‌రెడ్డి, ఐడీటీఏ అధికారులు జాఫర్‌లు బాధిత చెంచు మహిళను పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అదేవిధంగా, కొల్లాపూర్ తహసీల్దార్ ఆదేశాల మేరకు భ్రమరాంబ చెంచు కాలనీలో నివాసం ఉన్న బాధిత మహిళకు సోమవారం రెవెన్యూ సీనియర్ అసిస్టెంటు గోవిందురెడ్డి బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు.

ప్లాస్టిక్ వాడకం నిర్మూలనకు అందరూ సహకరించాలి


వటవర్లపల్లిలో ప్లాస్టిక్ కవర్లలో ఉన్న ఆహార పదార్థాలు

దోమలపెంట, జూలై 1: అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో వివిధ గ్రామాల్లో ఉన్న వ్యాపారుస్తులు ప్లాస్టిక్స్ వాడకం నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జూలై 1 నుంచి చర్యలు చేపట్టాలని అటవీశాఖను ఆదేశించగా, అందులో భాగం గా సోమవారం అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంట గ్రామాల్లో దోమలపెంట డీఆర్‌వో ఖాజామైనోద్దీన్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు హోటళ్లు, కిరాణషాపులు, తనిఖీ చేసి కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ చిప్స్ ప్యాకెట్, బిస్కెట్ ప్యాకెట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ప్లాస్టిక్స్ వాడకం నిర్మూలన కొరకు గత నెల రోజులుగా వ్యాపార స్థులకు అవగాహన కల్పించినప్పటికీ పెడచెవిన పెట్టడంతో వస్తువులను స్వాధీ నం చేసుకున్నామని ఇంకా ముందు ఇలాగే కొనసాగితే జరిమానా విధించడం కాకుండా కేసులు కూడా నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎఫ్ఎస్‌వో వాసవి, ఎఫ్‌బీవోలు ముత్యాలు, చరత్, అటవీశాఖ సిబ్బంది గ్రామస్థులు ఉన్నారు.

రెండు నెలల పాటు చేపల వేట నిషేధం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 1: శ్రీశైలం బ్యాక్ వాటర్, జూరాల జలాశయాలలో రెండు నెలల పాటు చేపల వేట నిషేధించినట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి లక్ష్మప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు మత్స్యకారులు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లడానికి వీల్లేదన్నారు. ఈ రెండు నెలల కాలంలో చేపలు తమ సంతతిని పెంచుకునేందుకు ప్రత్యుత్పత్తి జరుపుతాయని అన్నారు.

ఈ విషయాన్ని నది పరివాహక ప్రాంతాల గ్రామ పంచాయతీల కార్యదర్శి చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం, జూలై 1 : అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన అనీల్ ఆదివారం రాత్రి బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని రాయిచూరుకు తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అనీల్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత

- కల్వకుర్తి- జడ్చర్ల ప్రధాన రహదారికి దగ్గర కొండకు అనుమతులు
- మట్టి తరలింపులో నిబంధనలు బేఖాతరు
- తీయాల్సిన దానికంటే ఎక్కువగానే మట్టి తరలించారు
- ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని 167 హైవేపై భయాందోళనలో ప్రయాణికులు

ఊర్కొండ, జూలై 1: అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత అంటూ మండల అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న సర్వే నంబరు 244 కొండపై మైనింగ్ శాఖ అధికారులు రెండు ఎకరాల 24 గుంటల్లో మట్టి తీయడానికి కల్వకుర్తి-సోమశిల రహదారి నిర్మాణం చేపడుతున్న గుత్తేదారులు అనుమతులు పొందారు. దాంతో 167 జాతీయ రహదారి పక్కనే ఉండటంతో నిబంధనలు పాటించలేదని అధికారుల తీరుపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతుల పేరా అక్రమ తవ్వకాలను చేపడుతూ నిబంధనలు పాటించడం లేదని, తీయాల్సిన మట్టి కంటే ఎక్కువ తీస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి(కల్వకుర్తి-జడ్చర్ల) 167 పక్కనే కొండను కింది భాగంలో మట్టి తీస్తుండటంతో పైన ఉన్న పెద్ద రాళ్లు ఎక్కడ వచ్చి తమపై పడుతాయోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా సోమశిల రోడ్డుకు మట్టి తరలిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


మట్టిని తవ్విన గోతులు


ఊర్కొండలో కొండను తవ్వి మట్టిని తరలిస్తున్న వాహనాలు

ప్రమాదపు అంచులో కొండ



ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న కొండ నుంచి కల్వకుర్తి- సోమశిల రోడ్డు నిర్మాణం నిమిత్తం తరలిస్తున్న మట్టి కోసం కొండను తవ్వుతున్నారు. దాంతో పైన ఉన్న పెద్ద రాళ్లు ఎప్పుడు కింద పడుతాయోనని ఆందోళన చెందుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్, రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడం సమంజసం కాదు. వెంటనే అధికారులు పునఃపరిశీలించి అనుమతులు రద్దు చేయాలని కోరుతున్నాం.

- ఆదినారాయణ, ఊర్కొండ

అనుమతుల కంటే అధికంగా మట్టి తరలింపు



కల్వకుర్తి-సోమశిల రోడ్డు కోసం మండల కేంద్రంలోని కొండ నుంచి అనుమతుల పేరా అధికంగా మట్టిని తరలిస్తున్నారు. దాంతో గోతులు ఏర్పడి వర్షాకాలంలో కొండ మట్టి కరిగి పైనఉన్న రాళ్లు కింద పడే అవకాశం ఉంది. నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకొని మట్టి తరలింపును ఆపాలని కోరుతున్నాం.

- ఎండీ అరీఫ్, ఊర్కొండ

పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుంది



ఏఎస్ఐగా పదోన్నతి పొందిన శ్రీనివాసులును అభినందిస్తున్న ఎస్పీ

వనపర్తి క్రైం, జూలై 1: విధి నిర్వహణలో పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతోందని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐగా పదోన్నతి పొందిన శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన పరంధాములు, మహేష్ అవులయ్యలను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతులు పొందిన సిబ్బంది విధి నిర్వహణలో హుందాగా వ్యవహరించి ముఖ్యమైన కేసులను ఛేదించేందుకు కృషి చేయాలన్నారు. కింది స్థాయిలో పని చేస్తున్న సిబ్బందికి విధి నిర్వహణలో పలు సూచనలు చే యాలని తెలిపారు. మున్ముందు ఉన్నతస్థానాలలో పదవులు పొందేందుకు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. అంతకుముందు ఎస్పీ పోలీస్ ప్రజావాణి సందర్భంగా తమ ఛాంబర్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 12 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం వెంకటేష్

ఆత్మకూరు,జూలై1: వడ్డీలేని రుణాలను పొందిన చిన్న సంఘాల మహిళలు సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించి మిగతా మహిళలు రుణాలు పొందే విధంగా సహకరించాలని ఆత్మకూరు ఏపీఎం వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని జూరాల గ్రామంలో సోమవారం గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలను అందజేసింది. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ఇతర మహిళలు రుణాలు పొందేందుకు సహకరించాలని సూచించారు. గ్రామ సంఘం చెక్ బుక్స్ బ్యాంకు బుక్స్ గ్రామ సంఘం అధ్యక్ష కార్యదర్శుల దగ్గరనే ఉంచుకోవాలని ఈసీ సమావేశంలోనే సిబ్బంది వేతనాలను ఇచ్చే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో మండల మహిళా సమాఖ్య కార్యదర్శులు మహేశ్వరమ్మ, సీసీ అన్వర్ పాషా, విలేజ్ బుక్ కీపర్ కురుమూర్తితో పాటు పలువురు గ్రామ సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిన్న సంఘాల అధ్యక్షులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం


మద్దిలేటిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు, జూలై 1: వనపర్తి జిల్లా విద్యాధికారి మద్దిలేటి పదవీ విరమణ పొందడంతో ఆత్మకూరు ఇంటర్ కళాశాల అధ్యాపకులు సోమవారం జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విశ్వేశ్వర్ మాట్లాడుతూ ఆయన జిల్లా ఇంటర్ విద్య అధికారిగా విధులు నిర్వహించే ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులశాతం పెంచేందుకు అలాగే ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్, బాగ్యవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీ-8 కాల్వకు మరమ్మతులు


కాల్వలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

గోపాల్‌పేట, జూలై 1: మండలంలోని డి-8 కాల్వలో పిచ్చిమొక్కల తొలగింపును ఎక్స్‌కవేటర్‌తో కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సోమవారం మండలంలోని పోలికెపాడ్, బుద్దారం, గ్రామాల్లో ఉన్న డి-8 ఎడమ, కుడి కాల్వల్లో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, మరమ్మతులు, రోడ్డు డైవర్షన్ వద్ద పైపులైన్ పనులను చేపట్టారు. ఇప్పటికే బుద్దారం కుడి, ఎడుమ క్వాలలో భారీగా చేరిన నల్లమట్టి, కంపచెట్ల, పొడైన బ్యాంకింగ్ పనులను పూర్తిచేశారు. ప్రస్తుతం మూడు ఎక్స్‌కవేటర్ల సాయంతో కాల్వపనులను చేస్తున్నారు. కాల్వ పనులు పూర్తి అయితే గోపాల్‌పేట, వనపర్తి, పెద్దమండడి, ఘణపురం, మండలాల రైతులకు మేలు జరుగుతుంది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సొంత ఖర్చులతో పనులను చేయిస్తున్నారని నాయకులు తెలిపారు.

కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, జూలై 1: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట అంజనే యులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వీడాలని డిమాండ్‌తో కార్మికుల కోరికల దినాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కలెక్టరేట్ ముందు సీఐటీయూ అనుబంధ సంఘాలన్నింటితో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, నాయకులు బొబ్బిలి నిక్సన్, బుచ్చమ్మ, గంధం మదన్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

శ్రీరంగాపురం, జూలై1: ప్రతీ ఒక్కరు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు , జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ గెలల సేకరణ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై1: జిల్లాలోని అమరచింత, పెద్దమందడి, శ్రీరంగాపూర్, వీపనగండ్ల, పెబ్బేరు మండలాల పరిధిలో పండించిన ఆయిల్ పామ్ గెలలను సోమవారం సేకరించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 102 ఎకరాలలో 15మంది రైతులు పండించిన 24 టన్నుల 730 కేజీల గెలలను సేకరించినట్లు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో ఉన్న ఆయిల్ పామ్ నూనె తయారీ కర్మాగారానికి పంపినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఒక టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.13,438 ఉన్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 2800 ఎకరాలలో సాగు లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు ఆయన అన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, జూలై1: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని చాకల్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిరంజన్ (62) వ్యవసాయం కూలీ పనులు చేసేవాడు. భార్య ఎల్లమ్మ వీరికి ముగ్గురు పిల్లలు. కుమారులకు వివాహాలు కావడంతో భార్యాభర్తలు వేరుగా ఉంటున్నారు. సోమవారం రాత్రి పింఛన్ డబ్బుల విషయంలో భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. క్షణికావేశానికి లోనైన నిరంజన్ బాత్‌రూమ్‌లో పంచతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ రాకపోవడంతో భార్య ఎల్లమ్మ తలుపు తెరచి చూసింది. పైకప్పు రేకు పైపునకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులకు తెలుపడంతో 108కి సమాచారం ఇచ్చారు. కానీ, అప్పటికే నిరంజన్ మృతి చెందాడు.

ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

- ప్రజావాణిలో వినతుల స్వీకరణ


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 1: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్‌తో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గత వారంలో వచ్చిన 107 ఫిర్యాదులలో పరిష్కారం కానీ ఫిర్యాదులపై శాఖల వారీగా వివరణ అడిగారు. వచ్చిన ఫిర్యాదులకు రెండు రోజుల్లో పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పరిష్కారం కాని వాటిని ఉన్నతాధికారులకు , సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 74 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

● ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్న తనను కరోనాకాలంలో తొలగించారని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఘణపూర్ మండలం మామిడిమాడ గ్రామస్థుడు వెంకటయ్య కలెక్టర్‌ను కోరారు. ముగ్గురు ఆడపిల్లలు ఒక కుమారుడు కలిగిన తనకు ఎలాంటి ఉపాధి లేక బతుకు భారంగా మారిందన్నారు. స్వీపర్ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

● మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన నెలకొందని ఉప్పరిపల్లి గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు, పాఠశాల చైర్మన్ రేణుక సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సరిపడా తరగతి గదులు, మైదానం కూడా లేదన్నారు. భయంతో పిల్లల్ని పాఠశాలకు కూడా పంపడం లేదని తల్లిదండ్రులు తెలిపారు.

● డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గోవర్ధనగిరి గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

వర్షాకాలం ప్రారంభం అయినందున జిల్లాలో డయేరియా, డెంగీ, మలేరియా వంటివ్యాధులు వ్యాప్తి చెందకుండా లైన్ డిపార్ట్‌మెంట్‌లు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదులు అనంతరం ఆయన వైద్యాధికారులతో మాట్లాడారు. మునిసిపాలిటీ , పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, సంక్షేమ శాఖ, విద్యా, వైద్య శాఖలు తమ బాధ్యతలను పకడ్బందీగా నిర్వర్తిస్తే జిల్లాలో అంటు వ్యాధులు రాకుండా చేసుకోవచ్చన్నారు. ప్రతీ నెల 1, 11, 21వ తేదీల్లో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం క్లోరినేషన్ చేయడం ఎక్కడ నీటి కలుషితం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హై ఫీవర్ కేసులను అన్నింటికీ రక్త నమూనాలు తీసి పరీక్షలు చేయించాలని ఎక్కడైనా డెంగీ, మలేరియా, సెటీరియా కేసులు నమోదు అయితే నివేదికను కలెక్టర్‌కు పంపించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయచంద్ర మోహన్, మునిసిపల్ అధికా రులు, పంచాయతీ రాజ్ అధికారులు విద్య సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి: బీజేపీ

వనపర్తి అర్బన్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు బచ్చురాం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరిపడా వైద్యులు లేరని కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. వంద పడకల ఆసుపత్రికి కేవలం ఒకరిద్దరు డాక్టర్లతోనే నెట్టుకొస్తున్నారని, ఇక్కడ వైద్యం చేయకుండా వేరే ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారని ఈ విషయంపై కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు. అదే విధంగా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్, జనరల్ మెడిసిన్ విభాగాలలో డాక్టర్లు లేనందున బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీతారాములు, సుమిత్రమ్మ, నాయకులు బచ్చురాం, కుమారస్వామి, ప్రకాష్‌ఆచారి, రాయన్నసాగర్, నరసింహ పాల్గొన్నారు.

వైద్యులు దైవంతో సమానం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- పలువురి వైద్యులకు సన్మానం


దాక్టర్లను సన్మానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, జూలై 1: వైద్యులు దైవంతో సమానమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలువురు డాక్టర్ల నివాసానికి వెళ్లి ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించడంలో ప్రత్యక్ష దైవాలుగా డాక్టర్స్ ఉంటారని కొనియాడారు. పదవీ విరమణ పొందిన జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ యుగంధర్ రెడ్డి శ్రీదేవి దంపతులను జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో కలిసి సన్మానించారు. ప్రజా డాక్టర్‌గా నియోజకవర్గంలో విశేష సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాలకిష్టయ్య విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ నాగన్న యాదవ్, మాజీ కౌన్సిలర్ తిరుమల్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్, నాయకులు జాత్రునాయక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, చిట్యాల రాము పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో..

వనపర్తి వైద్యవిభాగం: వైద్యుడు అంటే కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని మనిషి ప్రాణాలను కాపాడే మహాశక్తి అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టులు అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టులు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ సత్రూనాయక్, డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ చైతన్యగౌడ్ తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టు యూనియన్ హెల్త్ కన్వీనర్ గంధం దినేష్, మహమ్మద్ ఖలీల్, శ్రీనాథ్, తరుణ్, ఫోటో జర్నలిస్టు లోకేష్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా సంఘం ఆధ్వర్యంలో....

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సభ్యులు జనరల్ ఆస్పత్రిలో వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీ, సభ్యులు ఉమ, సాయిలీల, కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట ఆరోగ్య కేంద్రంలో..

కొత్తకోట : పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేం ద్రంలో తెలంగాణ రాష్ట్ర సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్‌వో) ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు, టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ కేక్‌కట్ చేసి ఆస్పత్రి డాక్టర్లకు శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు ఆసియాబేగం, మంజుశ్రీ ఆర్ఎంపీల మండల అధ్యక్షులు శ్రీశైలం, టీఎస్ఎస్‌వో రాష్ట్ర నాయకులు సుదర్శన్, వెంకటకృష్ణ, జ్యోషి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న జవన్నను మిత్రులు మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు మిషేక్, ప్రభుత్వ హస్టల్ వార్డెన్ బెనర్జీ, బుచ్చన్నగౌడ్ శాలువాతో సన్మానించారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఆవిష్కరణ


సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తకోట, జూలై 1 : సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల (ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల) పదవీ కాలం పూర్తి కానున్న సందర్భంగా మండల పరిషత్ ప్రొఫెసర్ జయశంకర్‌సారు సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ పోరాటలో ప్రజలను ఐక్య చేసిన మహానాయకుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించడంలో ముందుందామన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం సభ్యులకు శాలువా, మెమోంటోలతో ఎంపీపీ గుంత మౌనిక, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సభ్యులు పద్మమ్మ, లక్ష్మీ, వసంత, సవరన్న, శైలజ, రాధ, చిట్టెమ్మ, లక్ష్మ నాయక్, రంగారెడ్డి, శేషిరెడ్డి, అల్లాబాషలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీడీవో రవీంద్రబాబు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవం

కొత్తకోట మండలంలోని రాయనిపేట గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రాధ, పీఆర్‌డీఈ నాగేశ్వర్‌రావు, నాయకులు డాక్టర్ పీజే. బాబు, బీచుపల్లి యాదవ్, వెంకట్రామారెడ్డి, అమర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శివరాజ్, శివరాములు, సత్యం, చింటు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది

- రవాణా శాఖ అధికారి మానసకు వినతి



రవాణా శాఖ అధికారి మానసకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వనపర్తి టౌన్, జూలై 1: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు స్కూల్ బస్సులను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో రవాణా శాఖ అధికారి మానసను కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్ బస్సులు నడుపుతున్న కొందరు డ్రైవర్లు మద్యం తాగి విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్నారని, స్కూల్ బస్సు నడిపే ప్రతీ డ్రైవర్‌కు అనుభవం, ఆరోగ్యంగా ఉండే వారినే డ్రైవర్లుగా కొనసాగించాలన్నారు. బస్సులకు తప్పని సరిగా ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సర్టిఫికెట్, ఫస్ట్ ఏయిడ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాకే అనుమతులు ఇవ్వాలన్నారు. సీట్లకు మించి విద్యార్థులతో నడుస్తున్న బస్సులను ఎక్కడికక్కడ నిలిపేసి ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, కమిటీ సభ్యులు భరత్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


రైతు బంధుపై అభిప్రాయ సేకరణ

వనపర్తి రూరల్,జూలై 1: వనపర్తి పట్టణ పరిధిలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, రైతుబంధుపై అభిప్రాయం సేకరణ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ వెంకట్రావు, మండల వ్యవసాయ అధికారి కురుమయ్య, సీఈవో గోపాల్, రైతులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలి'

మదనాపురం, జూలై1: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అంగన్‌వాడీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో నెంబరు 10ని తెచ్చిందని, దానిని రద్దు చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. రెండు లక్షలు, ఆయాలకు రూ. లక్ష ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

వనపర్తి వైద్యవిభాగం, జూలై 1: ఉమ్మడి రాష్ట్రంలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన నియమితులైన ఏఎన్ఎంలను శాశ్వత ప్రతిపాదికన రెగ్యులరైజ్ చేయాలని పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఎన్ఎంలు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వోను కలిసిన ఏఎన్ఎంలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్రంలోని వివిధ పీహెచ్‌సీలు, వాటి ఉపకేంద్రాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు శాశ్వత ప్రతిపాదికన నియమించబడుటకు పూర్తిగా అర్హులన్నారు. రాష్ట్రంలో ఉన్న 300కు పైగా ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం కూడా పడదన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుమిత్ర, లలిత, సునిత, జయలక్ష్మి, లక్ష్మీదేవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులకు సన్మానం

పాన్‌గల్, జూలై 1: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మూడవత్ లక్ష్మి ఎంపీటీసీ సభ్యులను సన్మానించనున్నట్లు ఎంపీడీవో కోటేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ పాలక వర్గం ఏర్పడి అయిదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నందున మం గళవారం మధ్యాహ్నం రెండు గంటలకు గౌరవ సభ్యుల ను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతి నిధు లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నూతన ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ కల్యాణ్‌రావును సన్మానిస్తున్న నాయకులు

పాన్‌గల్, జూలై1: నూతన ఎస్ఐ కల్యాణ్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, మాజీ సర్పంచులు జయరాములుసాగర్, వెంకటయ్యయాదవ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్‌లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అదేవిధంగా శాఖాపూర్ గ్రామానికి చెందిన నాయకులు ఎస్ఐని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, నిరంజన్, శంకర్‌నాయక్, శాఖాపూర్ నాయకులు తిరుపతయ్య, మల్లేష్ యాదవ్, చంద్రయ్య తదితరులున్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

పాన్‌గల్, జూలై1: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలపై ఈ నెల 4న మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీలో గల కార్మికుల నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేసి గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ సూర్యవంశంరాము, పంచాయతీ కార్మికులు, యూనియన్ నాయకులు సురేష్, నాగేంద్రం తదితరులున్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలు

వనపర్తి రూరల్, జూలై 1: రెండు వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొన్న ఘటన వనపర్తి మండల పరిధిలోని రాజపేట గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఆత్మకూరు పట్టణానికి చెందిన ఎండి షరీఫ్ ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకుని వనపర్తి మాతా శిశు హాస్పిటల్‌లో అడ్మిన్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు. రాజపేట గ్రామ శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న గద్వాల డిపో ఆర్టీసీ బస్సును ఢీకొన్నాయి. ప్రమాదంలో అంబులెన్స్ అద్దాలు పగిలిపోయి డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అంబులెన్స్ డ్రైవర్ ఎండి ఫరీద్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ జలందర్ రెడ్డి ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తామన్నారు.

నివాస భూములకు రైతుబంధు ఆపాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్

వీపనగండ్ల, జూలై 1: నివాస కల్లందొడ్ల భూములకు రైతుబంధు డబ్బులు ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. బొల్లారం రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 618లో 15.10 ఎకరాల భూమిలో నివాస గృహాలు కల్లందొడ్లు ఉన్నాయని తెలిపారు. ఆ భూమికి రైతుబంధు మంజూరు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు వంక గోపాల్, రమేష్, చర్మారెడ్డి, గ్రామస్థులు ఎరుకలి గోపి, చాకలి స్వామి, వెంకటయ్య, చిన్నస్వామి తదితరులున్నారు.

సంకిరెడ్డిపల్లి విద్యార్థులకు బస్సు సౌకర్యం

కొత్తకోట, జూలై 1: మండలంలోని సంకిరెడ్డిపల్లి గ్రామ విద్యార్థులకు సోమవారం నుంచి బస్సు సౌకర్యం లభించింది. కొంత కాలంగా విద్యార్థులు, నాయకులు, ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీ సం విద్యార్థుల కోసమైన బస్సును నడపాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే వనపర్తి ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఆ మేరకు విద్యార్థుల కోసం బస్సు నడుపుటకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామానికి బస్సు రావడంతో కాంగ్రెస్ విద్యార్థి సంఘం నాయకులు ముస్తఫా, ప్రజలు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తకోట, జూలై 1 : మండలంలోని కానాయపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గోపాల్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. రావుల వెంట వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, రాజు, కుర్మయ్య, వెంకట్‌కుమార్ ధనుష్, లక్ష్మయ్య తదితరులున్నారు.

అన్నదాతలకు సన్మానం

ఖిల్లాఘణపురం, జూలై1: రైతు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో సోమవారం విశ్వ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కమ్మరి గోపి ఆధ్వర్యంలో అన్నదాతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సామ్యా నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, రైతులు గోనెల రాంచందర్, దేవేందర్, సత్యం గౌడ్, కమ్మరి లక్ష్మణ, రైతులు , గ్రామ యువకులు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, జూలై 1: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. గత వారంలో నిర్వహించాల్సిన మండల సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామన్నారు. ఈనెల 4న మండల పరిషత్ కార్యాలయంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరు కానున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పట్టాలిచ్చిన లబ్ధిదారులకు స్థలం చూపాలి

అమరచింత, జూలై1: ఇంటి స్థలం కోసం పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు ప్రభుత్వం తక్షణమే ఇండ్ల స్థలాలు చూపాలని సీపీఎం నాయకులు ఆర్ఎన్ రమేష్, అజయ్, బుచ్చన్న, వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక ఏళ్ల క్రితం పట్టాలిచ్చి ఇళ్ల స్థలాలు చూపకపోవడంతో లబ్ధిదారులు అదే స్థలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని వారన్నారు. ఎన్నికలకు ముందు ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు చూపుతానని చెప్పి మాట నిలబెట్టుకోలేక పోయిందని వారన్నారు. నూతన ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలను చూపించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.